పలుచోట్ల వడగళ్ల వాన

దుబ్బాక, మే 2 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక మండలం పెద్దచీకోడు, ఆరెపల్లి, పోతారం, గంభీర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. గాలిదుమారంతో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి ఐకేపీ ఏపీఎంతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

సిద్దిపేట కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న జరగబోయే యూజీ నీట్ 2025 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. హాల్ టికెట్, 1 పాస్‌పోర్ట్ సైజు ఫొటో, 1 ఆధార్ కార్డు లేదా పాన్‌కార్డు ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులను మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మొత్తం 883 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు.


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, సీపీ

పటిష్ట బందోబస్తు

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. రెండు సెంటర్ల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ మధ్యాహ్నం 1 నుంచి సాయం త్రం 7 గంటల వరకు వరకు అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా పరీక్ష జరిగేలా చూడాలని బయోమెట్రిక్, అభ్యర్థి ఐడెంటిఫికేషన్‌లో ఏదైనా సమస్య వస్తే సంబంధితపై అధికారులకు తెలియజేయాలని తెలిపారు. బూట్లు, సాక్స్ బెల్టు, బంగారం, వెండి, ఇతర ఆభరణాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవని సూచించారు. ఫుల్ షర్ట్‌కి అనుమతిలేదని, హాఫ్ హ్యాండ్ షర్ట్ మాత్రమే వేసుకోవాలని సూచించారు.

అన్ని క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభను చాటాలి

సమ్మర్ కోచింగ్ క్యాంపును సందర్శించిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : అన్ని క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభను చాటాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో జరగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయస్థాయిలో రాణించేందుకు కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎం.ఖాసీంబేగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో విద్యార్థితో చెస్ ఆడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి


రైఫిల్‌ను ఎక్కుపెడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

కానరాని కల్లాలు..!

- జిల్లాలో 3.95లక్షల ఎకరాల్లో పంటసాగు
- వరి 3.64 లక్షల ఎకరాలు, మక్క 31,309 ఎకరాల్లో సాగు
- కల్లాలు నిర్మించడంలో అధికారుల విఫలం
- రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్న రైతులు
- సూచిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు

తొగుట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈ రబీ సీజన్‌లో సిద్దిపేట జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల్లో రైతులు పంటను సాగుచేసినప్పటికీ పంట ఆరబెట్టేందుకు కల్లాలు లేక గ్రామాల్లో రైతులు నానా తంటాలు పడుతున్నారు. పండించిన పంట ఆరబెట్టేందుకు సదుపాయాలు లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపైకి తీసుకొస్తున్నారు. గతంలో జాతీయ ఉపాధిహామి పథకంలో కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికి ఆ నిధులను పక్కదారి పట్టించడంతో పాటు భారీగా అక్రమాలు చోటు చేసుకోవడంతో ఆ పథకాన్ని అధికారులు నిలిపివేశారు


తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామశివారులో రోడ్డుపైన ధాన్యం కుప్పలు


తొగుట మండలం ఘనపూర్ గ్రామ శివారులో..


చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లో..

సిద్దిపేట జిల్లాలో

జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 3,95,459 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. 3,64,150 ఎకరాల్లో వరి, 31,309 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. దుబ్బాక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో... 84,409 ఎకరాల్లో వరి, 4179 ఎకరాల్లో మక్క జొన్న పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో 16,883 ఎకరాలు. దౌల్తాబాద్ మండలంలో 16,029, దుబ్బాక మండలంలో 27,967 ఎకరాలు, మిరుదొడ్డి మండలంలో 11,583 ఎకరాలు, తొగుట మండలంలో 11,583 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇంత పంట సాగు చేసినప్పటికి రైతులకు సదుపాయాలు కల్పించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

సూచిక బోర్డుల మాటే లేదు...

రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఇష్టారీతిన ఆరబెడుతున్నారు. రాత్రిళ్లు ధాన్యాన్ని ఒకదగ్గరకు చేర్చి నల్లని టార్పాలిన్ కవర్లు కప్పుతున్నారు. టార్పాలిన్ కవర్లు ఎగిరిపోకుండా చుట్టూ పెద్దపెద్ద రాళ్లు పెడుతున్నారు. వాహనదారులకు అవి కనిపించక వాటిని గుద్దుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల భూంపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ధాన్యం కుప్పను ఢీకొని వాహన చోదకుడు ప్రమాదానికి గురయ్యాడు. రైతులు కనీసం ధాన్యం కుప్పల వద్ద సూచిక

మిగతా 8లో..

మెరుగైన వైద్యసేవలందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్


అజయ్‌కుమార్‌కు సమస్యలను వివరిస్తున్న టీపీసీసీ నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి

దుబ్బాక, మే 2 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక వంద పడకల ఆసుపత్రిని శుక్రవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సందర్శించారు. టీపీసీసీ నాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులను, ఇన్‌పేషంట్ రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో సహజ ప్రసుతి సేవలను పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని మురుగు కాలువలు సక్రమంగా లేవని, వాటికి సంబంధించి ఇంజనీర్లతో మాట్లాడారు. ఎముకల వైద్యులు లేరని, సిబ్బంది కొరత ఉందని కమిషనర్ దృష్టికి టీపీసీసీ నాయకులు శ్రావణ్‌కుమార్ తీసుకెళ్లారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు తాను దుబ్బాకకు వచ్చానన్నారు. ఎముకల వైద్యులతో పాటు సిబ్బంది నియామకానికి మంత్రి దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయనతో పాటు ఆసుపత్రి వైద్యులు హేమరాజ్ సింగ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం

చేర్యాల, మే 2(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ సం దర్భంగా మల్లన్న ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల సెల్‌ఫోన్స్ భద్రపరుచుకునేందుకు దండు రవి రూ.15.20లక్షలకు హెచ్చుపాట పాడి టెండర్ పొందాడు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్-2ను ప్రతినెలా అద్దె రూ.7,400 చొప్పున కేటాయించారు. పాత ఇనుము సామాగ్రి కిలోకు రూ.28 చొప్పున కొనుగోలు చేయడాన్ని రాజు దక్కించుకున్నాడు. సీసీ కెమెరాల నిర్వహణ రఘుపతి పొందాడు. వేలంపాటల్లో ఆలయధర్మకర్తలు మోహన్ రెడ్డి, అంజిరెడ్డి ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత..

- నంగునూరు మండలంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా
- ప్రభుత్వ అనుమతుల పేరిట నయా దందా
- డంప్ చేసి రాత్రి వేళల్లో దూరప్రాంతాలకు తరలింపు
- భూగర్భజలాలు తగ్గుతున్నాయని రైతుల ఆందోళన

8

నాడు కళకళ.. నేడు వెలవెల

- డి.ధర్మారం పెద్దచెరువు
- పర్యాటక రూపునకు నిరాదరణ
- రెండేళ్ల క్రితం మినీట్యాంక్‌బండ్‌గా కొత్తరూపు
- మొదట్లో పర్యాటకుల రాకతో సందడి
- ఏడాదిగా చెరువులో వరుస విషాదాలు

7

పోలీస్ శాఖకు ఫైరింగ్ రేంజ్ కీలకం

- ప్రమాదాలు జరగకుండా వినియోగించుకోవాలి : ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- నార్సింగ్ మండలం అటవీ ప్రాంతం శివారులో
- పోలీస్ ఫైరింగ్ రేంజ్ ప్రారంభం



7





భానుడి ప్రతాపం.. అంగళ్లు వెలవెల

హుస్నాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. వేడిని తట్టుకోలేక ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. భగ్గుమంటున్న ఎండలతో అంగళ్లు వెలవెలబోతున్నాయి. గిరాకీలు లేక చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగే వారసంత ఎండలతో జనం లేక వెలవెలబోయింది. ఈ సంతకు చుట్టు 100 గ్రామాల ప్రజలు వస్తుంటారు. అయితే ఎండల వల్ల జనం రాక గిరాకీలు లేని పరిస్థితులు ఏర్పడ్డాయని చిరువ్యాపారులు వాపోతున్నారు. ఈ అంగడి ద్వారా మున్సిపాలిటీకి రూ.కోటి ఆదాయం వస్తున్నా వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో ఎండల నుంచి తట్టుకునేందుకు మార్కెట్‌లో టార్పాలిన్ కవర్లు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఉత్తర తెలంగాణలో పశువుల అంగడికి హుస్నాబాద్ పెట్టింది పేరు. మండుతున్న ఎండలతో ఉదయం 11 గంటలకే క్రయవిక్రయాలు జరిగి మధ్యాహ్నం 12 గంటల వరకే పశువుల సంత బోసిబోతుంది.

ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు

కొండపాక, మే 2 (ఆంధ్రజ్యోతి):ఆయిల్‌పామ్ తోటలతో రైతులకు అధిక లాభాలు పొందొచ్చని ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి శివరామకృష్ణ అన్నారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో శుక్రవారం రైతులు వేసిన ఆయిల్‌పామ్ తోటలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రభుత్వం అధిక సబ్సిడీ అందిస్తుందని పేర్కొన్నారు. మార్కెట్‌లో మంచి ధరకు విక్రయించి రైతులు లాభాలు పొందొచ్చని వివరించారు. ఈ విషయమై క్షేత్రస్థాయి అవగాహన సదస్సుల కోసం జిల్లావ్యాప్తంగా ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు అంతర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి కౌసల్య, ఆయిల్ ఫెడ్ ఏరియా ఆఫీసర్ శంకర్, వ్యవసాయ ఆయిల్‌ఫెడ్ క్షేత్రసిబ్బంది పాల్గొన్నారు.


ఆయిల్ పామ్ తోటలను పరిశీలించిన అధికారులు

అటకెక్కిన సుందరీకరణ

- మున్సిపాలిటీలో సర్కిళ్ల అభివృద్ధిపై నీలినీడలు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ తిప్పలు
- పట్టింపు లేని నాయకులు

గజ్వేల్, మే2 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల పరిధిలో సర్కిళ్ల అభివృద్ధి అటకెక్కింది. మున్సిపాలిటీ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డుతో పాటు.. రింగురోడ్డుకు సమాంతరంగా రేడియల్ రోడ్లు, మధ్యలో సర్కిళ్ల అభివృద్ధి చేపట్టాలని గత సర్కారు నిర్ణయించింది. ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినా పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం సర్కిళ్ల అభివృద్ధిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. సర్కిళ్లను అభివృద్ధి చేయకపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు లేకపోలేదు. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముట్రాజ్‌పల్లి సర్కిల్‌ను పూర్తి చేసినప్పటికీ అక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రారంభించకపోవడంతో పాటు సుందరీకరణ పనులను మొదలుపెట్టకపోవడంతో అందుబాటులోకి రాలేదు. పలు ప్రారంభమైనప్పటికీ... మరికొన్ని పెండింగ్‌లో పడడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


అభివృద్ధికి నోచుకోని గజ్వేల్ ఇందిరాపార్కు చౌరస్తా


ప్రారంభానికి నోచుకోని ముట్రాజ్‌పల్లిలోని సర్కిల్

మున్సిపాలిటీలో ఎనిమిది సర్కిళ్లు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిది సర్కిళ్లను అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ పనులు ఆయా కారణాలతో ముందుకు సాగక పోవడంతో ప్రస్తుతం పనులు జరగడం అనుమానంగానే కనిపిస్తుంది. గజ్వేల్‌లో ప్రధాన చౌరస్తా అయినా ఇందిరాపార్క్ సుందరీకరణ, ప్రజ్ఞాపూర్ చౌరస్తా, బాబూ జగ్జీవన్‌రామ్ వై సర్కిల్, ముట్రాజ్‌పల్లి చౌరస్తా, ఐవోసీ సర్కిల్, పిడిచెడ్ చౌరస్తా, జాలిగామా బైపాస్ సర్కిళ్లను సుందరీకరణ చేసేందుకు నిర్ణయించారు. ఇందులో అంబేడ్కర్ సర్కిల్, జగ్జీవన్ రామ్ సర్కిల్, ముట్రాజ్‌పల్లి సర్కిల్ మినహా మిగతా ఏ పనులు చేపట్టలేదు. అత్యధిక ట్రాఫిక్ ఉండే ఇందిరా పార్క్ సర్కిల్ సుందరీకరణ, ప్రజ్ఞాపూర్ సర్కిల్ సుందరీకరణ, పిడిచెడ్ చౌరస్తా సర్కిల్ సుందరీకరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటి కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సర్కిళ్లను అభివృద్ధి చేస్తే మారనున్న రూపురేఖలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో రేడియల్ రోడ్లకు, రింగ్‌రోడ్డుకు తగిన గుర్తింపు రావాలంటే సర్కిళ్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. తద్వారా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రోడ్ల రూపురేఖలు మారే అవకాశం ఉంది. చాలా చోట్ల ఆయా విగ్రహాలు, ఫౌంటేన్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తే సర్కిళ్లు ఆకర్షణగా నిలిచే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకునే నాయకులు లేకపోవడంతో సర్కిళ్ల అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. దాదాపు రూ.2కోట్ల నిధులు ఉన్నా పనులు సాగడం లేదని తెలుస్తుంది.

మనస్తాపంతో భర్త మృతి

చేగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్యచేసుకున్నాడు. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా కైజు గ్రామానికి చెందిన నందులాల్ చౌదరి(28) చేగుంట జీవిక పరిశ్రమల్లో కార్మికుడిగా పని చేసేవాడు. అతడికి ఏడాది క్రితం వివాహమైంది. భార్య కాపురానికి రాకపోవడంతో తరచూ బాధపడుతూ ఉండేవాడు. మనస్తాపంతో చందులాల్ జీవిక పరిశ్రమలోని లేబర్ రూమ్‌లో ఉరేసుకున్నాడు. చౌదరి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ములుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం బస్వాపూర్ గ్రామ శివారులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బస్వాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తిపై ఎవరో పెట్రోల్ పోసి కాల్చి చంపినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మీ చుట్టుపక్కల మీ గ్రామంలో ఎవరైనా తప్పిపోయినట్లు సమాచారం ఉంటే వెంటనే గజ్వేల్ రూరల్ సీఐ(8712667336), ఎస్ఐ(9440552391)కు తెలియజేయాలని కోరారు.

పడకేసిన పట్టణ ప్రణాళిక

- తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జి టీపీవోలు
- పనిభారంతో కాంట్రాక్ట్ సిబ్బందితో కార్యకలాపాలు
- కాలనీలు, విలీన గ్రామాల్లో అంతా వారే



తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం

రామచంద్రాపురం టౌన్ మే 2 (ఆంధ్రజ్యోతి) : నగర శివారు పటాన్‌చెరు నియోజకవర్గం పట్టణీకరణ వైపు వేగంగా దూసుకెళ్తుంది. గతంలో అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారంలు మున్సిపాలిటీలుగా ఏర్పాటు కాగా ఇటీవల ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ బల్దియాల్లో సిబ్బంది నియామకం ఇంకా పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ప్రధాన పాత్ర పోషిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం(టీపీవో)లోనూ రెగ్యులర్ ఉద్యోగులు లేక నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఇన్‌చార్జి టీపీవోలు వారి తరఫున కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించుకుని పనిచేయాల్సి వస్తుంది.

అంతా ఇన్‌చార్జులే

మున్సిపాలిటీల్లో ఆస్తులకు చెందిన ప్రతీ చిన్నపాటి సమస్యకు టీపీవోలు పరిష్కార కర్తలుగా వ్యవహరిస్తారు. అయితే, మున్సిపాలిటీల్లో రెగ్యులర్ టీపీవోలు లేకపోవడం శాపంగా మారింది. ఇన్‌చార్జిలుగా టీపీవోలు పనిభారంతో మున్సిపాలిటీల్లో ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. జహీరాబాద్ టీపీఎస్ మహేష్ తెల్లాపూర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు. ఇటీవల ఆయన టీపీవోగా ప్రమోషన్‌పై వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే, అమీన్‌పూర్ టీపీవోగా ఉన్న పవన్ తాండూరు ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్నారు. ఆయన అమీన్‌పూర్‌తో పాటు ఐడీఏబొల్లారం, పరిగి మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అలానే రామగుండం పురపాలక సంఘంలో పని చేసి బదిలీపై వచ్చిన సంజన గడ్డపోతారం, గుమ్మడిదల, మేడ్చల్ జిల్లాలోని దుండిగల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోనూ టీపీవోగా పనిచేస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులే శరణ్యం

టీపీవోలు ఇన్‌చార్జిలుగా వ్యవహరించడం వల్ల స్థానికంగా ఇబ్బందులు కలుగకుండా కాంట్రాక్ట్ బేసిస్ మీద సిబ్బందిని నియమించుకుంటున్నారు. అమీన్‌పూర్ పురపాలక సంఘంలో 250పైచిలుకు కాలనీలతో పాటు 10 గ్రామాలు ఉన్నాయి. ఇన్‌చార్జి టీపీవో వారానికి రెండు రోజులు మాత్రమే సమయాన్ని కేటాయిస్తున్నారు. పూర్తిస్థాయి విధులు నిర్వర్తించడానికి అదనంగా 13 మంది సిబ్బందిని నియమించుకున్నారు. అలానే తెల్లాపూర్ మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. 11 గ్రామాలతో పాటు 60పైచిలుకు కాలనీలు ఉండగా, ఇన్‌చార్జి టీపీవో కింద పనిచేయడానికి కొత్తగా చేరిన గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్‌లను వినియోగిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఎల్లయ్య మృతదేహం

హత్నూర, మే 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం దౌల్తాబాద్ గ్రామ శివారులో జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్య(65) పని నిమిత్తం గురువారం ఉదయం ఇంటి నుంచి దౌల్తాబాద్‌కు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం దౌల్తాబాద్ శివారులోని ఓ వెంచర్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆధార్ కార్డు ఆధారంగా గుండ్లమాచనూర్ గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్యగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అతని ఒంటిపై ఉన్న వెండి, రింగులు నడుము వెండి గొలుసులు కనిపించకపోవడంతో ఎవరో హతమార్చి ఉంటారని కుటుంబీకులు అనుమానించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని దగ్ధం చేసిన దుండగులు

దుబ్బాక, మే 2 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ వార్డులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని దగ్ధం చేసినట్లు దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన రాళ్లపేట శివదినేష్ తన టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని గురువారం రాత్రి రోజువారిగానే తన ఇంటిముందు నిలిపి ఉంచారు. శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా శబ్దం రావడంతో లేచి చూసేసరికి ద్విచక్రవాహనానికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. వాహనం పూర్తిగా దగ్ధం అయింది. గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనాన్ని కావాలనే దగ్ధం చేశారని ఆరోపిస్తు, బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

వెల్దుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్మారం అడవిలో దొరికిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వివరాలు శుక్రవారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మాసాయిపేటకు చెందిన రాజుల ఎల్లయ్యగా పోలీసులు నిర్ధారించారు. మృతుడు తూప్రాన్‌కు చెందిన ఓ పండ్ల వ్యాపారి వద్ద పని చేస్తున్నాడు. ఆ వ్యాపారి ఎల్లయ్యను వెల్దుర్తి మండలంలోని కుకునూర్‌లోని ఓ మామిడి తోటలో కాపలాగా ఉంచినట్లు పోలీసులు నిర్ధారించారు. వడదెబ్బ కారణంగా ఎల్లయ్య మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గాభవానీమాత జాతరకు ఏర్పాట్లు పూర్తి

● నాగిరెడ్డిపల్లిలో నేటి నుంచి ఉత్సవాలు



ముస్తాబైన ఆలయం

కోహీర్, మే 2: (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో 3వ తేదీ నుంచి 6 వరకు మూడు రోజులపాటు శ్రీదుర్గాభవానీమాత జాతర నిర్వహించనున్నారు. మొదటిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గ్రామ దేవతలకు ఆహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 4న అమ్మవారికి అభిషేకం, గ్రామదేవతలకు బోనాల నివేదన, 5న ఉదయం అమ్మవారికి జత్తికడవ సమర్పణ, అమ్మవారి కల్యాణం, భవిష్యవాణి కార్యక్రమాలు కొనసాగుతాయి. 6న పల్లకీ సేవ కార్యక్రమంతో పాటు మహాప్రసాద వితరణతో జాతర ఉత్సవాల ముగుస్తాయి.

లక్ష్మీనారాయణస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధం



మారేపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం

కొండాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మారేపల్లి లక్ష్మీనారాయణస్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. సంగారెడ్డి శ్రీ వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో జరిగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాలకు వారం ముందు నుంచే భజన సంకీర్తనలు, దేవదేవుళ్ల భక్తి ప్రవచనాలు, ఉపదేశాలు కొనసాగుతున్నాయి. నేడు ఉత్సవమూర్తుల విగ్రహాలను సంగారెడ్డి వైకుంఠపురం నుంచి రథంపై ఊరేగింపుగా మారేపల్లి లక్ష్మీనారాయణ ఆలయం వరకు తీసుకువస్తారు. చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి.



డి.ధర్మారం పెద్దచెరువు మినీట్యాంక్‌బండ్

నాడు కళకళ.. నేడు వెలవెల

డి.ధర్మారం పెద్దచెరువు పర్యాటకానికి నిరాదరణ

రెండేళ్ల క్రితం మినీట్యాంక్‌బండ్‌గా కొత్తరూపు
మొదట్లో చిన్నాపెద్ద రాకతో సందడి
ఏడాదిగా చెరువులో వరుస విషాదాలు
దీంతో ఇటువైపు తొంగిచూడని స్థానికులు

రామాయంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఆహ్లాదాన్ని పంచుతూ కళకళలాడిన చెరువు.. నేడు వెలవెలబోతుంది. వరుస విషాదాలు చోటుచేసుకోవడంతో ఇటువైపు వచ్చే వారే కరువయ్యారు. అదే మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని డి.ధర్మారం పెద్దచెరువు. గ్రామంలో నాలుగువేలకుపైగా జనాభా ఉంది. ఈ గ్రామాన్ని, రద్దీ రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువును రెండేళ్ల క్రితం రూ.1.50 కోట్లు ఖర్చుచేసి మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. చెరువు కట్ట పొడవునా టైల్స్ పరిచి, చక్కటి ప్లాట్‌ఫామ్‌ను నిర్మించారు. ఒకవైపు వాహనాల రాకపోకలు.. ఆ పక్కనే పార్క్.. ఎదురుగా కిలోమీటర్ మేర ఉన్న చెరువు నీటిని చూస్తూ ఆహ్లాదం ఉట్టిపడేలా దీన్ని తీర్చిదిద్దారు. కట్ట పక్కనే రహదారి, ఆవక్కనే చెట్లు, పొలాలతో ఆహ్లాదాన్ని పంచుతుంటుంది. మొదట్లో సమయం దొరికినప్పుడల్లా గ్రామస్థులు పిల్లలతో కలిసి ఇక్కడికి వచ్చి ఆనందంగా గడిపేవారు. కానీ, ఏడాది నుంచి విషాద ఘటనల నేపథ్యంలో అటు వెళ్లేందుకే ఎవరు ఇష్టపడటం లేదు. దీంతో ఆహ్లాదం పంచే చోటు వెలవెలబోతుంది.



పెద్దచెరువు కట్ట తూముపై నిజాం హయాం నాటి కట్టడం

చెరువులో ఏడుగురి మరణం

డి.ధర్మారం పెద్దచెరువులో ఏడాది క్రితం గ్రామానికి చెందిన యువకుడు మల్లంగారి ప్రశాంత్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిదప ఇద్దరు పిల్లలున్న గొల్ల కళ్యాణి (25) చెరువులోకి దూకి చనిపోయింది. గతేడాది మే 31న అమ్మమ్మ ఇంటికి వచ్చిన మాసానుపల్లి సరిత(25) చెరువులో శవమై తేలింది. అత్తింటివారు హత్య చేసి పడవేశారంటూ అప్పట్లో కుటుంబీకులు ఆరోపించారు. తదుపరి యువకులు బండారి యాదగౌడ్, సాజీద్ బలవన్మరణానికి పాల్పడ్డారు. గత డిసెంబర్ 30న నక్కని స్వామిదాస్(20) బంధువుల కర్మకాండకు వచ్చి స్నానానికి దిగి గల్లంతై చనిపోయాడు. చివరగా జనవరిలో నక్కని ఎల్లవ్వ అనే వృద్ధురాలు ఆత్మహత్యకు ఒడిగట్టింది. గ్రామం ఆనుకునే ఇంతటి పెద్ద చెరువు ఉండటం.. ఈ చెరువులో ప్రాణాలను పోగొట్టుకోవడంతో గ్రామస్థులు ఇటువైపు చూడడం లేదు. ఇంతగా నిధులు వెచ్చించి పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకున్న చెరువు మండలంలో ఇదొక్కటే. రహదారిపై వెళ్లే ప్రయాణికులను సైతం కనువిందు చేసే చెరువు వైపు ప్రస్తుతం చూసేవారే కరువయ్యారు. నిధులు వెచ్చించి చెరువుకు పర్యాటక రూపును ఇవ్వగా నిరాధరణకు గురవుతున్నది. పోలీసులు, పెద్దలు అపోహలను తొలగించి, చైతన్యవంతం చేయాల్సిన అవసరముంది.

చెరువు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



చెరువు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రద్దీ రహదారిపై ఉన్నందున ఇతర ప్రాంతాల వారు ఇక్కడ అఘాయిత్యాలకు పాల్పడి చెరువులో పడేసే వీలు కూడా ఉంది. అంతేకాదు రాత్రిపూట పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలి. ఆత్మహత్య ఘటనలు పునరావృతమవకుండా పోలీసులు గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి.

- ముస్కుల సుధాకర్‌రెడ్డి

పిల్లలతో సరదాగా గడపాలి



సీఎస్‌ఆర్, ఇతర నిధులతో పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడంతో కొత్తరూపును సంతరించుకున్నది. విషాదాలు చోటుచేసుకోవడం దురదృష్టకరం. భయపడకుండా గ్రామస్థులు పిల్లలతో సరదాగా గడపాలి. చెరువు వద్ద ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామపెద్దలు గ్రామస్థులతో చర్చించాలి.

- మహేందర్, పంచాయతీ సెక్రెటరీ

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి

● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
● కేంద్ర ప్రభుత్వానికి మంజీరా రచయితల సంఘం సూచన



మాట్లాడుతున్న మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, అబూజ్‌మడ్, తెలంగాణలోని సరిహద్దు దండకారణ్యం ప్రాంతాల్లో కొనసాగిస్తున్న మిలిటరీ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు, కవులు, రచయితలు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంజీరా రచయితల సంఘం(మరసం) అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు కె.రంగాచార్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ఈ ఆపరేషన్‌తో అమాయక ఆదివాసీ, గిరిజన ప్రజలు మరణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఇది ఆదివాసుల జీవించేహక్కును కాలరాయడమే అవుతుందని వాపోయారు. ప్రైవేట్ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్న కేంద్ర ప్రభుత్వం తమ సంపద తమకు కావాలని పోరాడుతున్న ఆదివాసులపై యుద్ధం ప్రకటించిందని ఆరోపించారు. విదేశీ శక్తులపై పోరాడాల్సిన సైనికుల్ని దేశ సంపదను రక్షించడానికి ప్రయత్నిస్తున్న ఆదివాసీలు, మావోయిస్టులపైకి కేంద్ర ప్రభుత్వం ఉసిగొలపడమేమిటని ప్రశ్నించారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం సాగించిన గ్రీన్ హంట్ ఆపరేషన్ అయినా, ఇప్పటి ఎన్డీఏ ఆపరేషన్ కగార్ అయినా రెండూ ఒకే లక్ష్యంతో చేస్తున్న ఆపరేషన్ లేనని వారు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని మరసం తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో మరసం ఉపాధ్యక్షుడు అలాజ్‌పూర్ శ్రీనివాస్, మరసం ప్రతినిధులు నందిని భగవాన్‌రెడ్డి, తోట అశోక్, మామిండ్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కథలు జనజీవితం నుంచే పుడతాయి

● వెన్నెల సాహితీ వార్షికోత్సవంలో రచయిత శిరంశెట్టి



కొమురవెల్లి అంజయ్యకి ప్రదానం చేస్తున్న జీవన సాఫల్య పురస్కారం

సిద్దిపేట కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కథలు జనజీవితం నుంచే పుడుతాయని, రచయితలు ప్రజల జీవితాలను పరిశీలిస్తూ ఉండాలని ప్రముఖ కథా, నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు అన్నారు. సిద్దిపేట శివానుభవ మండపంలో మేడే సందర్భంగా శుక్రవారం వెన్నెల సాహితీ సంగమం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్కపెల్లి యాదగిరి, వంగర నరసింహారెడ్డి, కొండి మల్లారెడ్డి రచించిన మూడు పాయలు కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ వెలుగులోకి రాని జీవిత విధానాలు చాలా ఉంటాయని, క్షేత్రస్థాయికి వెళ్లి సాధకబాధకాలను అడిగి తెలుసుకోవాలని, అలా రాసిన కథలనే పాఠకులు ఆదరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలోనే సీనియర్ పాత్రికేయులు, కవి రచయిత కొమురవెల్లి అంజయ్యకి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భముగా పాత్రికేయుడిగా కవిగా రచయితగా సామాజిక సేవకుడిగా వారు అందించిన సేవలను వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు తమ కవితలను వినిపించారు.



విద్యా శాఖ సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

ఉత్తీర్ణులైన విద్యార్థులు పైతరగతుల్లో ప్రవేశం పొందేలా చర్యలు చేపట్టాలి
ఒక్క విద్యార్థి డ్రాపౌట్ కాకుండా చూడాలి
మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎంఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా ఎంఈవోలకు శుభాకాంక్షలు తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులను డిగ్రీలో ప్రవేశం పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మెరుగైన విద్యకు పలు సలహాలు, సూచనలు అందించారు. జిల్లా సంక్షేమశాఖ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు పది పాసైన విద్యార్థులు ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి డ్రాపౌట్ కాకుండా చూడాలన్నారు. ఉన్నత చదువులు చదివి భావి భారత పౌరులుగా ఉండాలన్నదే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు ఫైరింగ్ రేంజ్ కీలకం

ప్రమాదాలు జరగకుండా వినియోగించుకోవాలి : ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



ఫైరింగ్ చేసిన బుల్లెట్‌ను పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

చేగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు ఫైరింగ్ రేంజ్ కీలకమైందని, దీనిని నార్సింగ్‌లో ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమైనదని మల్టీజోనల్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని అటవీ ప్రాంతం శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ ఫైరింగ్ రేంజ్‌ను శుక్రవారం ఐజీ కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత ఐజీ, ఎస్పీ, డీఎస్పీ, సీఐ 10 రౌండ్లు ఫైరింగ్ చేశారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా పోలీస్‌లు ఫైరింగ్ రేంజ్ కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఎస్పీ సహకారంతో జిల్లాలోనే ఏర్పాటైందన్నారు. ఫైరింగ్ రేంజ్‌ను ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలతో వినియోగించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రెండు నెలల్లో ఫైరింగ్ రేంజ్ పనులను పూర్తి చేసినందుకు జిల్లా పోలీస్ శాఖను ఐజీ అభినందించారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పోలీస్ ఫైరింగ్ రేంజ్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. కోరిన వెంటనే నార్సింగ్‌లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పోలీస్ శాఖ తరఫున ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాతి గుట్టలతో ఉన్న ఈ ప్రాంతాన్ని సీఎస్‌ఆర్ ఫండ్, దాతల సహకారంతో 40 రోజుల్లో పనులు పూర్తి చేసిన తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్‌రాజ్ సూచన

మెదక్ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత ఎక్కువ నమోదు అవుతున్న దృష్ట్యా ఎండదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్‌రాజ్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా కూడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వైద్యారోగ్య శాఖతో పాటు ఇతర శాఖల జిల్లా అధికారులు వడదెబ్బ నివారణపై వారివారి శాఖల ప్రణాళికలకు అనుగుణంగా వేసవి తీవ్రత సమయంలో చేయాల్సిన, చేయకూడని పనుల గురించి ప్రజలకు తెలపాలన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాలటించి ఆరోగ్యాలను సంరక్షించుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని సూచించారు. ఎండలలో పనిచేయవద్దని తెలిపారు. ఆల్కహాల్, టీ, కాఫీ, స్వీట్స్, చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయట రావద్దని కోరారు. అలాగే చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతీ రోజు సరిపడా నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న తెల్లని దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లాలని, లేదా టోపీ, రుమాలు ధరించాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని పేర్కొన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108కు ఫోన్ చేసి చికిత్స తీసుకోవాలని, అవసరమైన మందులు పొందాలని సూచించారు. అన్ని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బ నివారణ ఔషధాలు సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని కలెక్టర్లు కోరారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలి

సంగారెడ్డి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ జాబితా నుంచి తొలగించేందుకు ఫామ్ 9, చిరునామా మార్పు, ఫామ్ 8లను పరిశీలించాలని సూచించారు. ఒకే కుటుంబంలో ఉన్నా, ఒకే గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలపై సమరశీల పోరాటాలు

సంగారెడ్డి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం తగదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని పలుమార్లు ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి లాంటివి చేసినందుకే సర్కారు దిగివచ్చి మే నెలంతా సెలవులు ప్రకటించిందన్నారు.

కాళ్లకల్‌వాసి సందీప్‌రెడ్డికి డాక్టరేట్



కసిరెడ్డి సందీప్‌రెడ్డి

మనోహరాబాద్ మే 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని భారతీదాసన్ విశ్వవిద్యాలయం నుంచి మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన కసిరెడ్డి సందీప్‌రెడ్డి డాక్టరేట్ పట్టాను పొందారు. ప్రస్తుతం ఆయన మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సహాయ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు సహచర కళాశాల యజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలియ జేశారు.

మర్కుక్ వరదరాజస్వామి ఆలయానికి విరాళాలు

గజ్వేల్/మర్కుక్, మే 2 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలంలో వెలసిన శ్రీ భూనీలా సమేత వరదరాజ స్వామి ఆలయాన్ని దాతల సహాయంతో పునర్నిర్మాణం చేస్తున్నారు. దేవస్థానం పునః ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ అభివృద్ధికి పలువురు విరాళాలతో పాటు వస్తురూపేణ సామగ్రిని అందజేస్తూ సహకరిస్తున్నారు. శుక్రవారం సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు రూ. లక్ష విలువైన వంట సామగ్రిని విరాళంగా అందజేశారు. మర్కుక్ మండల మాజీ సర్పంచ్ భాగ్య భిక్షపతి తమ పెళ్లిరోజును పురస్కరించుకుని రూ. 5,111 విరాళాన్ని శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులకు అందజేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు దూళిమిట్ట విద్యార్థులు

ధూళిమిట్ట, మే 2(ఆంధ్రజ్యోతి): పదకొండవ బాలికల జూనియర్ అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూళిమిట్ట ఉన్నత పాఠశాల విద్యార్థినులు సంజన, మేఘన, శ్రావణి, ప్రణతి, సింధు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు మే 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జగిత్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

తొగుట, మే 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యం పెట్టుకుని ఉన్నతంగా ఎదగాలని ఏపీపీసీ చైర్‌పర్సన్ పొన్నాల లక్ష్మి సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9 రోజుల సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సయ్య, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఫరీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తవ్వుకునోడికి తవ్వుకున్నంత..

- నంగునూరు మండలంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా
- ప్రభుత్వ అనుమతుల పేరిట నయా దందా
- డంప్ చేసి రాత్రి వేళల్లో దూరప్రాంతాలకు తరలింపు
- భూగర్భజలాలు తగ్గుతున్నాయని రైతుల ఆందోళన




వట్టిపోతున్న ఖాత ఘనపూర్ పెద్దవాగు, అనుమతుల పేరిట సాయంత్రం 6 తర్వాత సిద్దిపేటకు ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

నంగునూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పనుల పేరిట నిబంధనలను తుంగలో తొక్కుతూ విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతున్నది. మండలంలోని ఖాత, ఘనపూర్, అక్కెనపల్లి, నంగునూరు పెద్దవాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుక ట్రాక్టర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపే ఇసుకను తరలించాలి. ప్రభుత్వ పనుల కోసం ఇసుక రవాణాకు ఇస్తున్న అనుమతులను ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా రవాణా చేస్తున్నారు. సాయంత్రం ఏడు వరకు నంగునూరు నుంచి సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల తదితర పట్టణాలకు ఇసుకను తరలిస్తున్నారు. కొత్తగా ఇల్లు కట్టుకునేవారికి ఇసుక కావాలంటే వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి పేరిట తెచ్చిన ట్రాక్టర్ లోడ్ ఇసుకను మండలంలో రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పోస్తున్నారు. అదే సిద్దిపేట, మిట్టపల్లి, రంగధాంపల్లి ప్రాంతంలో అయితే రూ. 5 వేల నుంచి రూ. 7 వేల మధ్య ప్రైవేటు వ్యక్తులకు పోస్తున్నారు.

అనుమతుల పేరిట దుర్వినియోగం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీసీ రోడ్లు మంజూరు చేయడంతో ఇసుక రవాణాకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చారు. ఈ అనుమతులను దుర్వినియోగం చేస్తూ తవ్వుకున్నోడికి తవ్వుకున్నంతగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక తరలించే ట్రాక్టర్లకు, ట్రాలీకి కనీసం నెంబర్ ప్లేటు కూడా లేకపోవడం గమనార్హం. వ్యవసాయ బావుల వద్ద డంప్ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా హైదరాబాద్ తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల వ్యాప్తంగా ఎక్కువ శాతం నంగునూరు, అక్కెనపల్లి, ఖాత, నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లు సుమారుగా 50 నుంచి 70వరకు ఉన్నట్లు సమాచారం. ఇసుక దందా విషయంలో వ్యాపారులు సంబంధిత అధికారులతో కుమ్మక్కయినట్టు ఆరోపణలున్నాయి. ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వివిధ శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సామాన్యుడికి తక్కువ రేటుకు ఇసుక దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

బోర్లు వట్టిపోతున్నాయ్..

విచ్చలవిడిగా ఇసుకను తరలించడం వల్ల మండల వ్యాప్తంగా వాగు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయే ప్రమాదం ఏర్పడిందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఖర్చుచేసి బోర్లు వేస్తే వట్టిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం తరలించే ఇసుక విషయంలో ప్రత్యేకంగా ఒక అధికారిని కేటాయించి ఒక్కో ట్రాక్టర్ ఎన్ని ట్రిప్పులు తీసుకెళ్తున్నదో గుర్తించేలా చర్యలు చేపట్టి ఇసుక రవాణాను నియంత్రించాలని వివిధ గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మండలంలోని అక్కెనపల్లి, ఘనపూర్ ఖాత పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుకను తరలించేందుకు ఆర్డీవో కార్యాలయం ద్వారా అనుమతులు ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు మాత్రమే ఇసుకను తరలించాలి. ఇసుక తరలింపు విషయంలో ఎక్కడైతే అనుమతి ఉందో అక్కడే పోయాలి. మరోచోటికి ఇసుకను తీసుకెళ్తే చర్యలు తీసుకుంటాం. ఇసుక రవాణా విషయంలో పోలీసుల సహకారంతో నిఘా పెడతాం.

- సరిత, నంగునూరు తహసీల్దార్

దళారులను నమ్మి మోసపోవద్దు



తొగుట: బండారుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య

తొగుట/మిరుదొడ్డి, మే 2 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోవద్దని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య రైతులకు సూచించారు. శుక్రవారం తొగుట మండలం బండారుపల్లితో పాటు మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చేపడతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రదేశంలో సౌకర్యాలు ఉన్నాయాలేవా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు పశువుల పాకను నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మహాశక్తిపథకం ద్వారా పెరటికోళ్ల పెంపకానికి ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. పీడీ వెంట ఏపీవో శ్రీనివాస్, మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీఎం దాకయ్య, ఏపీవో సుభాష్, సీసీ బాల్‌రాజు, టీఏలు పరవురాములు, యాదవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

కేంద్రాల్లో వసతులు కల్పించాలి

హుస్నాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. మండుటెండల సమయంలో కేంద్రాల్లో మెడికల్ కిట్లు, రైతులు కూర్చునేందుకు టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంలో ఐకేపీ, సహకార సంఘం, మార్కెట్ అధికారులు విఫలమయ్యారని తెలిపారు. రెండు రోజుల్లో వసతులు కల్పించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం



హోమకుండానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దౌల్తాబాద్,మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణ మహోత్సవం గత 3 రోజులుగా ఘనంగా కొనసాగుతున్నది. శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి కల్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దమ్మతల్లి ఆలయం వద్ద మినీఫంక్షన్ హాల్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బండారుదేవేందర్, తిరుపతి, జిల్లా బీఆర్ఎస్ నాయకుడు ఖలీలుద్దీన్, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, ముదిరాజు సంఘం సభ్యులు సత్తయ్య, నాగరాజు, ఎల్లం, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజాచార్యుల జయంతి

చేర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్ రామానుజాచార్యుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రామానుజస్వామి అభిషేకం, నక్షత్ర తనియ విన్నపం జరిపారు. అనంతరం ప్రధానార్చకుడు మంగళగిరి శేషాచార్యులు మాట్లాడుతూ రామానుజాచార్యుల బోధనలు ఆచరణీయమన్నారు.

రాజగోపాలపేట పాలిటెక్నిక్ లో ఉచిత కోచింగ్

నంగునూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఈ నెల 5 నుంచి 12 వరకు డిప్లొమా కోర్సులో ప్రవేశం కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అలుగోజు గోవర్దన్ తెలిపారు. శుక్రవారం రాజగోపాలపేట పాలిటెక్నిక్‌లో విలేకరులతో మాట్లాడుతూ పాలిసెట్ -2025 రాసే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిపుణులైన అధ్యాపకులచే తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులకు తరగతులు నిర్వహించడంతో పాటు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు రాజగోపాలపేట పాలిటెక్నిక్‌లో పాలీసెట్ కోచింగ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.కవితను, లేదా 9000363725, 9010222189 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ శిక్షణాశిబిరం ప్రారంభం

హుస్నాబాద్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో శుక్రవారం వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. మొదటిసారి హుస్నాబాద్ పట్టణంలో ఫుట్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామని కోచ్ బానోతు రాజు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కానరాని కల్లాలు..!

(5వ పేజీ తరువాయి)

బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.

కల్లాలు ఏర్పాటు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే ప్రభుత్వం కల్లాలు ఏర్పాటు చేయాలి. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కల్లాలే లేకపోవడంతోనే రోడ్లపైన ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుంది.

- చిక్కుడు చంద్రం రైతు (తుక్కాపూర్)

రోడ్లపైన ధాన్యం ఆరబెట్టొద్దు



రైతులు ధాన్యాన్ని రోడ్లపైకి తీసుకురాకుండా కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలి. ధాన్యం కుప్పలతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రైతులంతా పోలీసులకు సహకరించాలి. లేకుంటే కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది.

- లతీఫ్, తొగుట సీఐ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గజ్వేల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వంటేరు యాదవరెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రఫూక్‌కు సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 60వేల చెక్కును ఎమ్మెల్సీ ఆయనకు శుక్రవారం అందజేశారు. వెంట గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకియోద్దీన్, నాయకులు మామిడి శ్రీధర్, అల్తాఫ్ ఉన్నారు.

● **జగదేవ్‌పూర్:** మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన మ్యాకల రాకేష్ అరోగ్యం బాగాలేక ఇటీవల హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో సీఎంఆర్ ఎఫ్ కింద ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం గజ్వేల్ మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ బట్టు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బట్టు ఎల్లారెడ్డి, ఉప్పల అశోక్, బొక్కల మల్లేశం ఉన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

ములుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర‌న్‌విజయ పేర్కొన్నారు. శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ములుగులోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన 116 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో మల్కాగళ్ల సింగారం బాలవ్వ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకొని బీజేపీ గ్రామ అధ్యక్షుడు గుండారం నవీన్ శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు.

కులగణనపై కేంద్రప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం



హుస్నాబాద్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్/మిరుదొడ్డి/దూళిమిట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో స్థానిక బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌పార్టీ ఏనాడూ కులగణన చేపట్టలేదని విమర్శించారు. ఈ కులగణన సర్వే చరిత్రాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణన తప్పుల తడకగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, భూక్య సంపత్, నాయకులు తదితరులున్నారు. దుబ్బాకలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటిబాలేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, మల్లారెడ్డి, వెంకట్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, నరేష్, రమణరెడ్డి, బద్రి, నిహాల్, సాయికుమార్, యాదయ్య, బాల్‌రాజు తదితరులున్నారు. దూళిమిట్ట మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడం యాదగిరి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా నాయకులు లక్ష్మణ్‌నాయక్, భిక్షపతి నాయక్, నాయకులు మహిపాల్ గౌడ్, శ్రీనివాస్ నాయక్,రమేష్ గౌడ్, కుమారస్వామీ, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్రంలో వైభవంగా శంకర జయంతి




నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, చేర్యాల సద్గురుసదన్‌భవన్‌లో విశేష అలంకరణలో ఆదిశంకరాచార్య మూల విగ్రహం

వర్గల్/చేర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోని శివాలయంలో శుక్రవారం శంకర జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు విద్యాసాగర్ శర్మ నేతృత్వంలో ఉదయం శంకర జయంతి సందర్భంగా శివాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి. అదేవిధంగా చేర్యాల పట్టణశివారులోని సద్గురుసదన్ ఆదిశంకర మందిరంలో ఆదిశంకర జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశంకరాచార్యుల మూలమూర్తికి రకరకాల పండ్లు, పూలతో విశేషఅలంకరణ చేశారు. శాస్త్రోక్తయుక్తంగా పూర్ణాభిషేకం, గురుపూజ, శారదా చంద్రమౌళీశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రాంపూర్‌లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిద్దిపేట రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఏఎస్ఐ పరమేశ్వరి గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామంలో మహిళా చట్టాల పై షీ టీం బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ పరమేశ్వరి మాట్లాడుతూ అపరిచితులు వచ్చి కొన్ని డబ్బులు పెట్టుబడి పెడితే అధికమొత్తంలో లాభాలు వస్తాయని ప్రలోభపెట్టేవారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే కమిషనరేట్ షీ టీం నెంబర్ 8712667434కు లేదా 100 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుళ్లు మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మహిళా చట్టాలపట్ల అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ షీ టీమ్‌బృంద సభ్యురాలు స్వప్న అన్నారు. చేర్యాల పట్టణంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ, భరోసా కల్పించేందుకు షీ టీమ్స్ పనిచేస్తుందన్నారు. ఏదైనా సంఘటన జరిగితే మహిళలు మౌనం వీడి పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాడుతాం



సిద్దిపేటలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన

సిద్దిపేట కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరం చట్టం రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని సిద్దిపేట ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం నమాజ్ తర్వాత సిద్దిపేట ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తా నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు అబ్దుల్ సమి, ఉబెదుర్ రెహమాన్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టంపై కేంద్ర ప్రభుత్వ జోక్యం తగదన్నారు. చట్టం రద్దయ్యే వరకు శాంతి యుతంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

కశ్మీర్ ఉగ్రదాడులను ఖండిస్తున్నాం..

కశ్మీర్ లోయలో ఉగ్ర దాడులను తీవ్రంగా ఖండిస్తునామన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మృతుల ఆత్మశాంతి కోసం రెండు నిముషాలు మౌనం పాటించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

గజ్వేల్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రగతి వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రగతి వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంటర్‌లో ఫార్మటెక్, ఎంఎల్‌టీతో పాటు ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ విద్యార్థులకు ప్రముఖ ఫార్మా కంపెనీలలో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు తెలిపారు. 18 నుంచి 23 ఏళ్ల లోపు ఉండి, 2022-2025 విద్యాసంవత్సరాలకు సంబంధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ధృవ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, 4 పాస్‌ఫోటోలను తీసుకునిరావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9393381618 నెంబరులో సూచించారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



రాహుల్, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, బీసీ కుల గణన దేశానికే ఆదర్శంగా నిలిచాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలను క్షీరాభిషేకం చేశారు. రాహుల్‌గాంధీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేయాలని సూచించారన్నారు. అందుకు అనుగుణంగానే సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, విజయమోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దృఢసంకల్పంతో లక్ష్యాన్ని సాధించాలి

కొండపాక, మే 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో లక్ష్యసాధనకు దృఢ సంకల్పంతో కృషి చేయాలని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ శాంతి పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట శివారులోని శ్రీకృపఫార్మసీ కళాశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టుదలతో చదువుతూ అనుకున్నది సాధించాలన్నారు. విద్యార్థులకు పరిశోధన, పరిశీలన అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు మామిడాల శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

హుస్నాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 468/470 మార్కులు సాధించిన హుస్నాబాద్ పట్టణంలోని ఆరపల్లికి చెందిన రాధారపు శ్రీవైష్ణవిని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదువుతున్న శ్రీవైష్ణవి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు.

● **చేర్యాల:** పదో తరగతి వార్షిక ఫలితాలలో చేర్యాల పట్టణానికి చెందిన జెజుగం శ్రీజ 587 మార్కులు, ఇంటర్‌లో గౌరిశెట్టి సాత్విక 465, గందె సహస్ర 455మార్కులు సాధించడం పట్ల స్థానిక వాసవీనగర్ కాలనీ సభ్యులు అభినందించారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను శాలువాతో సత్కరించారు.

● **కొండపాక:** పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీ విద్యార్థులను ఆ సమాజం ప్రతినిధులు మండలకేంద్రంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన పేర్ల సాధిక, మామిడాల నాగచైతన్య, దూడం పావని అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సమాజం అధ్యక్షుడు మంతెన నాగరాజు, ఉపాధ్యక్షుడు దూడ ఆనంద్, కార్యవర్గ సభ్యులు మంతెన యాదగిరి, పులగం రఘు, మల్లేశం, మామిడాల బాలయ్య, మంతెన రవీందర్, మంతెన నవీన్, మామిడాల వెంకటేశం, పేర్ల రాంబాబు, పేర్ల మధుబాబు, మదూరి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.